# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 30-06-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

❖ ఆధునిక సాంకేతికత ఆసరాతో పశు వైద్య ఆసుపత్రులను మరింత పటిష్టం చేయగలమని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు.

❖ చట్ట సభలలో ఉత్తమ పనితీరుతోనే ప్రజాస్వామ్యం బలోపేతం అవుతుందని లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా అన్నారు.

❖ అమర్‌నాథ్ యాత్ర నేపథ్యంలో యాత్రికుల ఆఫ్‌లైన్ రిజిస్ట్రేషన్ కోసం టోకెన్ పంపిణీ ప్రారంభమైంది.

❖ తెలంగాణలో పాశమైలారం పారిశ్రామిక వాడలో జరిగిన దుర్ఘటనపట్ల ప్రధానమంత్రి నరేంద్రమోదీ సంతాపం వ్యక్తం చేశారు.

❖ దేశంలో క్వాంటం సాంకేతికత ఆవిష్కరణలు విశేషపరిణామమని కేంద్ర సహాయ మంత్రి జితేంద్ర సింగ్ అన్నారు.

=========================

ఆధునిక సాంకేతికతను ఉపయోగించడం ద్వారా దేశవ్యాప్తంగా పశు వైద్య ఆసుపత్రులను మరింత శక్తివంతం చేయగలమని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. ఉత్తర ప్రదేశ్‌లోని బరేలీలో ఈ రోజు జరిగిన ఇండియన్ వెటర్నరీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (IVRI) 11వ స్నాతకోత్సవంలో రాష్ట్రపతి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ… సాంకేతికతను అనుసంధానించి పశు వైద్యం పశు సంరక్షణల విషయంలో కీలక మార్పులను తీసుకురాగలమని అన్నారు. జునోటిక్ వ్యాధుల నియంత్రణలో IVRI ముఖ్యమైన పాత్ర పోషించగలదని రాష్ట్రపతి పేర్కొంటూ…

(వాయిస్ 35 సెకన్లు)

=========================

తెలంగాణ రాష్ట్రం సంగారెడ్డి జిల్లా పాశమైలారం పారిశ్రామిక వాడలోని ఒక రసాయన పరిశ్రమలో ఈ రోజు ఘోర ప్రమాదం జరిగింది. పరిశ్రమలోని రియాక్టర్ ఒక్కసారిగా భారీ శబ్దంతో పేలిపోవడంతో 8 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. మరో 28 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదంపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విచారం వ్యక్తం చేశారు. మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి నుంచి 2 లక్షల రూపాయలు, ప్రమాదంలో గాయపడిన వారికి 50 వేల రూపాయలు నష్టపరిహారం ప్రకటించారు. కాగా, పారిశ్రామికవాడలో జరిగిన పేలుడు ఘటనపై తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.

==========================

దేశంలో క్వాంటం సాంకేతికత విశేష పరిణామమని కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అమరావతిలో ఏర్పాటు చేసే క్వాంటం కంప్యూటింగ్ వ్యాలీపై విజయవాడలో ఈ రోజు రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ వర్క్ షాప్ లో ఆయన ఢిల్లీ నుండి దృశ్య మాధ్యమం ద్వారా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... దేశంలోని 4 ప్రాంతాలలో క్వాంటం పరిశోధనా కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. 17 రాష్ట్రాలలో 152 సంస్థలు క్వాంటం సాంకేతికత విషయంలో పనిచేస్తున్నాయని జితేంద్రసింగ్ పేర్కొంటూ...

(వాయిస్ 17 సెకన్లు)

==========================

టికెట్ల ధరలను పెంచుతూ రైల్వేశాఖ నిర్ణయం తీసుకుంది. పెంచిన టికెట్ల ధరలు జులై ఒకటవ తేదీ నుంచి అమలులోకి రానున్నాయి. ఏసీ చైర్ క్లాస్, ఏసీ త్రీ టైర్, త్రీ టైర్ ఎకానమీ, ఏసీ టూ టైర్, ఏసీ ఫస్ట్ క్లాస్, ఎగ్జిక్యూటివ్ క్లాస్‌లలో కిలోమీటరుకు 2 పైసలు పెంచుతున్నట్లుగా పేర్కొంది. అలాగే జనరల్ కోచ్‌లో సెకండ్ క్లాస్ ఆర్డినరీలో 500 కిలోమీటర్ల వరకు చార్జీల పెంపు ఉండదని రైల్వేశాఖ తెలిపింది. 501 కిలోమీటర్ల నుంచి 1,500 కిలోమీటర్ల వరకు 5 రూపాయలు, ఇక 1,501 కిలోమీటర్ల నుంచి 2,055 కిలోమీటర్ల వరకు 10 రూపాయలు పెరగనుండగా... 2,501 కిలోమీటర్ల నుంచి 3 వేల కిలోమీటర్ల వరకు 15 రూపాయలు చార్జీ పెంచినట్లుగా వివరించింది. మరో వైపు ఫస్ట్‌క్లాస్, స్లీపర్ క్లాస్‌లో కిలో మీటర్‌కు అర పైసా పెరిగింది.

==========================

అమర్ నాథ్ యాత్ర నేపథ్యంలో యాత్రికుల ఆఫ్ లైన్ రిజిస్ట్రేషన్ కోసం జమ్మూలోని సరస్వతి ధామ్‌లో టోకెన్ పంపిణీ కేంద్రాన్ని ఈ రోజు ఏర్పాటు చేశారు. ఈ యాత్ర సజావుగా సాగడం కోసం జమ్మూ-శ్రీనగర్ జాతీయ రహదారి వెంబడి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని అధికారులు తెలిపారు. మొత్తం 38 రోజుల పాటు జరిగే ఈ యాత్ర జులై 3న ప్రారంభం కానుంది. కాగా, జమ్మూలోని భగవతి నగర్ బేస్ క్యాంప్ నుంచి యాత్రికుల మొదటి బృందం జులై 3న కశ్మీర్‌కు బయలుదేరుతుంది. అదే విధంగా రేపటి నుండి మరో మూడు కేంద్రాలలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుందని అధికారులు తెలిపారు.

విరామం

==========================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జులై 2వ తేదీ నుండి ఐదు దేశాల పర్యటన చేపడతారని విదేశాంగ మంత్రిత్వ శాఖ ఆర్థిక సంబంధాల కార్యదర్శి దమ్ము రవి తెలిపారు. న్యూఢిల్లీలో ఈ రోజు జరిగిన పాత్రికేయుల సమావేశంలో ప్రధానమంత్రి ఘనా, ట్రినిడాడ్ టొబాగో, అర్జెంటీనా, బ్రెజిల్ నమీబియా దేశాలలో ప్రధానమంత్రి పర్యటిస్తారని పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

==========================

రెండు దేశాల మధ్య శాశ్వత రక్షణ సహకారాన్ని మరింత పెంపొందించడానికి ఆర్మీ స్టాఫ్ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది ఈరోజు భూటాన్‌లో నాలుగు రోజుల అధికారిక పర్యటనకు బయలుదేరారు. ఈ పర్యటనలో జనరల్ ద్వివేది భూటాన్ రాజు జిగ్మే ఖేసర్ నాంగ్యేల్ వాంగ్‌చుక్‌ను కలుస్తారు. అదే విధంగా భూటాన్ ఆర్మీ చీఫ్ ఆపరేషన్స్ ఆఫీసర్ లెఫ్టినెంట్ జనరల్ బాటూతో కూడా చర్చలు జరుపుతారు. ఈ పర్యటన భారత్ - భూటాన్ దేశాల మధ్య బలమైన సంబంధాలకు బాటలు వేస్తుందని అధికార వర్గాలు తెలిపాయి.

==========================

చట్ట సభలలో ఉత్తమ పనితీరుతోనే ప్రజాస్వామ్య సంస్థలను బలోపేతం చేయగలమని లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా అన్నారు. హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రం ధర్మశాలలోని తపోవన్‌లో కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ (CPA) జోన్-2 వార్షిక సమావేశాన్ని లోక్‌సభ స్పీకర్ ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వర్తమాన కాలంలో శాసన వ్యవస్థ పనితీరు మరింత మెరుగైన తీరులో సాగేందుకు  వినూత్న విధానాలను అన్వేషించాలని సూచించారు. సాంకేతిక యుగంలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి ఈ తరహా సమావేశాలు ఎంతగానో ఉపయోగపడతాయని ఓం బిర్లా పేర్కొంటూ...

(వాయిస్ 33 సెకన్లు)

==========================

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పెయిన్, పోర్చుగల్ బ్రెజిల్ దేశాల అధికారిక పర్యటనకు ఈ రోజు ఢిల్లీ నుంచి బయలుదేరి వెళ్ళారు. జులై 5 వరకు ఆమె ఆయా దేశాలలో పర్యటిస్తారని అధికార వర్గాలు వెల్లడించాయి. స్పెయిన్ పర్యటన సందర్భంగా  నిర్మలా సీతారామన్  ఐక్యరాజ్యసమితి నిర్వహించే 4వ అంతర్జాతీయ అభివృద్ధి ఆర్థిక సదస్సు (FFD4)లో పాల్గొంటారు. ప్రపంచ వ్యాప్తంగా నూతనంగా ఎదురవుతున్న సవాళ్ళ నేపథ్యంలో స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలను పూర్తిగా అమలు చేయవలసిన అవసరం గురించి ఈ సమావేశంలో చర్చిస్తారు. అలాగే, అంతర్జాతీయంగా ఆర్థిక సంస్కరణలకు మద్దతు ఇవ్వడం, పరస్పర సహకారం వంటి వాటిపైన సైతం చర్చిస్తారని అధికార వర్గాలు పేర్కొన్నాయి.

==========================

అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో ఆహ్వానం మేరకు రేపు వాషింగ్టన్ డి.సి.లో జరగనున్న క్వాడ్ విదేశాంగ మంత్రుల సమావేశంలో పాల్గొనడానికి భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ ఈరోజు నుండి మూడు రోజుల అధికారిక పర్యటన చేపట్టారు.

==========================
==========================